నమస్తే తెలంగాణ
వికారాబాద్
I | హైదరాబాద్, సోమవారం 16 సెప్టెంబర్ 2024 | VIKARABAD

భాగ్యనగర్ ఉత్సవ సమితి ఆందోళన

దిగొచ్చిన సర్కారు

ట్యాంక్‌బండ్‌పై నిమజ్జన ఏర్పాట్లు

- ఏర్పాట్లు చేయకుంటే..మండపాల్లోనే గణనాథులను ఉంచుతామన్న ఉత్సవ సమితి హెచ్చరిక
- భక్తుల మనోభావాలు దెబ్బతీస్తారా అంటూ ఆగ్రహం
- ఆందోళనతో ట్యాంక్‌బండ్‌పై ప్రత్యేక ఏర్పాట్లు చేసిన అధికారులు

సిటీబ్యూరో, సెప్టెంబర్ 15 (నమస్తే తెలంగాణ): ట్యాంక్‌బండ్‌పై వినాయక నిమజ్జనం అనేక ఏండ్లుగా కొనసాగుతున్నదని, కొత్త రూల్స్ తీసుకొచ్చి.. భక్తుల మనోభావాలు దెబ్బతీస్తున్నారంటూ భాగ్యనగర్ ఉత్సవ సమితి సభ్యులు మండిపడ్డారు. ట్యాంక్‌బండ్‌పై నిమజ్జన ఏర్పాట్లు చేయాలని, లేదంటే సోమవారం అన్ని మండపాల నిర్వాహకులకు సమాచారమిచ్చి.. నగరవ్యాప్తంగా ఆందోళన చేసి.. ఎక్కడికక్కడ మండపాల్లో వినాయకులను అలాగే ఉంచుతామని హెచ్చరించారు. ట్యాంక్‌బండ్‌పై వినాయక నిమజ్జనం లేదంటూ పోలీసులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, బారికేడ్లను తొలగించారు. జాలీలను తొలగించి.. వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు. భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి సభ్యుల ఆందోళనకు దిగొచ్చిన ప్రభుత్వం హడావుడిగా ట్యాంక్‌బండ్‌పై ప్రత్యేక ఏర్పాట్లు చేసింది.

విద్యుత్ అంతరాయం తలెత్తకుండా..

గణేశ్ విగ్రహాల శోభాయాత్ర, నిమజ్జన కార్యక్రమం సజావుగా జరిగేందుకు దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ అన్ని ఏర్పాట్లు చేసింది. విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా ఉండేందుకు 10 సర్కిళ్ల పరిధిలోని ఉన్నతాధికారులతో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసి, క్షేత్ర స్థాయిలో ఉండి పర్యవేక్షణ చేయాలని సీఎండీ ముషారఫ్ ఫరూఖీ ఇప్పటికే ఆదేశించారు. ఇందులోభాగంగానే ఎన్టీఆర్ మార్గ్‌లో విద్యుత్ శాఖ ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ను ఇటీవలే సీఎండీ ప్రారంభించారు. నిమజ్జనం సందర్భంగా ప్రత్యేకంగా నిర్ణయించిన మార్గాల్లో శోభాయాత్రను నిర్వహిస్తున్న నేపథ్యంలో సరఫరా నిరంతరం ఉండేందుకు, విద్యుత్ అదనపు లోడ్‌కు సరిపోయేలా 500 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్లు , 315 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్లు 31, 160 కేవీఏ సామర్థ్యంతో కూడిన 37 ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసినట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. బాలాపూర్ నుంచి హుస్సేన్‌సాగర్ వరకు సాగే గణేశ్ విగ్రహాల శోభాయాత్ర కోసం సుమారు 55 కి.మీ మేర 11 కేవీ ఎల్‌టీ కేబుళ్లు, పోల్స్, కండక్టర్స్‌ను ఏర్పాటు చేశామన్నారు. కాగా, శోభాయాత్ర మొదలై నిమజ్జనం పూర్తయ్యే వరకు సూపరింటెండెంట్ ఇంజినీర్లు, డివిజినల్ ఇంజినీర్లు క్షేత్ర స్థాయిలో ఉండి పర్యవేక్షణ చేయనున్నారు. హుస్సేన్‌సాగర్ తీరంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూంలో విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉంటారని, మండప నిర్వాహకులు, ప్రజలు విద్యుత్ భద్రత సూచనలు పాటిస్తూ ఎక్కడైనా అవాంఛనీయ పరిస్థితులు ఏర్పడితే కంట్రోల్ రూమ్ లేదా 100, 1912 నంబర్లకు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని అధికారులు సూచించారు.

కీలక ఘట్టానికి సర్వం సిద్ధం..

గణపతి నవరాత్రోత్సవాల్లో కీలక ఘట్టమైన నిమజ్జనానికి అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. ప్రశాంత వాతావరణంలో పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టింది. హుస్సేన్‌సాగర్, జీడిమెట్ల ఫాక్స్ సాగర్, బహదూర్‌పురా, మీరాలం చెరువు, కాప్రా ఊర చెరువు, సరూర్‌నగర్ ట్యాంక్‌బండ్‌తో సహా పీవోపీ విగ్రహాల కోసం ప్రత్యేకంగా 73 కొలనులను ఏర్పాటు చేశారు. విగ్రహాల నిమజ్జనం కోసం పెద్ద సంఖ్యలో క్రేన్లను అందుబాటులో ఉంచారు. ఆరు జోన్ల పరిధిలో స్టాటిక్ క్రేన్స్ 21, మొబైల్ క్రేన్స్ 295, 213 గణేశ్ యాక్షన్ బృందాలను నియమించారు. అంతేకాకుండా వ్యర్థాలను తరలించేందుకు మినీ టిప్పర్లు 102, 125 జేసీబీలను సిద్ధం చేశారు. శోభాయాత్రకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్వహణ పనులతో పాటు తాత్కాలిక పనులు చేపట్టారు. నిర్వహణ పనులు 172లకు గానూ రూ.12 కోట్లు, తాత్కాలిక పనులు 36కి గానూ రూ.16కోట్లు ఖర్చు చేస్తున్నారు. 52వేల లైట్లను బిగించారు. భక్తుల సౌకర్యార్థం 309 మొబైల్ టాయిలెట్లను అందుబాటులో ఉంచారు.

మధ్యాహ్నం 1.30కల్లా మహాగణపతి నిమజ్జనం

సీపీ సీవీ ఆనంద్

అబిడ్స్, సెప్టెంబర్ 15 : వినాయక నిమజ్జనోత్సవం ప్రశాంతంగా జరిగేందుకు పోలీస్ శాఖ అన్ని ఏర్పాట్లను పూర్తి చేసిందని నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ పేర్కొన్నారు. నాంపల్లి భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఎగ్జిబిషన్ మైదానంలో ఆదివారం రాత్రి ప్రభుత్వ శాఖల అధికారులతో నిర్వహించిన సమన్వయ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ వినాయక నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని కోరారు. నిమజ్జనం కోసం సుమారు 25 వేల మంది పోలీస్ అధికారులు, సిబ్బందితో బందోబస్తు చర్యలు చేపట్టి, విస్తృత సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. ఖైరతాబాద్ మహా గణపతి నిమజ్జనం మధ్యాహ్నం మధ్యాహ్నం 1.30 కలా పూర్తవుతుందని, మిగతా విగ్రహాలను సైతం త్వరితగతిన నిమజ్జనం చేసినట్లయితే ఎవరికీ ఇబ్బందులు ఉండవన్నారు. భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి అధ్యక్షుడు రాఘవరెడ్డి, సమితి కార్యదర్శి డాక్టర్ రావి నూతల శశిధర్ మాట్లాడుతూ నిమజ్జనం సందర్భంగా మండప నిర్వాహకులు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్రభుత్వం అన్ని వసతులు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సైబరాబాద్ పోలీస్ జాయింట్ కమిషనర్ జోయల్ డేవిస్, జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్ రఘుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గ్రేటర్ @ 31.2 డిగ్రీలు

సిటీబ్యూరో, సెప్టెంబర్ 15 (నమస్తే తెలంగాణ): రుతుపవనాల ప్రభావంతో గ్రేటర్‌లోని కొన్ని చోట్ల తేలికపాటి జల్లులు పడ్డాయి. ఆదివారం సాయంత్రం నగరంలోని కుషాయిగూడ, ఏఎస్‌రావు నగర్, కాప్రా, బంజారాహిల్స్ తదితర ప్రాంతాల్లో జల్లులు కురిశాయి. కాగా, కిందిస్థాయి గాలుల ప్రభావంతో నగరంలో ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి. ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠం 31.2, కనిష్ఠం 23.2 డిగ్రీలు, గాలిలో తేమ 56 శాతంగా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.

పంటల బీమా.. ఏది ధీమా?

ప్రతికూల పరిస్థితుల్లో పంటలు దెబ్బ తింటే అన్నదాతలకు అండగా ఉండేందుకు ఫసల్ బీమా యోజన అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఖరీఫ్ సీజన్ ముగుస్తున్నా నేటికీ ప్రభుత్వం మార్గదర్శకాలను విడుదల చేయలేదు. దీంతో పంటల బీమా అమలుపై రైతుల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు జిల్లాలో వందల ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. బీమా అమలైతే నష్టపోయిన పంటలకు పరిహారం అందేది. ప్రభుత్వ అనాలోచిత విధానాలతో రైతులకు నిరాశే మిగులుతున్నది. గత యాసంగి నుంచి ప్రస్తుత వానకాల సీజన్ సైతం రైతులకు కలిసి రాకపోవడంతో రైతాంగం కుదేలు అవుతున్నది.

- రంగారెడ్డి, సెప్టెంబర్ 15 (నమస్తే తెలంగాణ)

కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరి 'పేరు గొప్ప..ఊరు దిబ్బలా' మారింది. రైతుల కోసం ఎంతో చేస్తున్నామన్న వారి మాటలు నీటి మూటలుగానే మిగిలిపోతున్నాయి. రైతులను ఆదుకునేందుకు అనేక స్కీంలను తీసుకొస్తున్నామని చెబుతున్నా.. ఆచరణకు వచ్చేసరికి ఉత్తుత్తిగానే ఉంటున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తామన్న ఫసల్ బీమా యోజన పథకం పరిస్థితీ అలాగే ఉన్నది. వానకాలం సాగు చేసే పంటలకు జూన్ నుంచి సెప్టెంబర్ వరకు బీమా పథకం వర్తిస్తుంది. గతంలో ఈ స్కీమ్‌కు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 95 శాతం, మిగిలిన 5 శాతం ప్రీమియాన్ని రైతులు చెల్లించేవారు. కొన్ని సమస్యలు ఎదురవడంతో ఉపయోగం లేదని ఈ పథకాన్ని గత బీఆర్ఎస్ ప్రభుత్వం నాలుగేండ్ల కిందట నిలిపివేసింది. అయితే ప్రస్తుత ప్రభుత్వం బీమా పథకం అమలు చేస్తున్నట్లు ప్రకటించింది. బీమా ప్రీమియాన్ని పూర్తిగా ప్రభుత్వమే చెల్లిస్తుందని స్పష్టం చేసింది. సెప్టెంబర్‌తో వానకాల సీజన్ ముగియనున్నది. కానీ..ప్రభుత్వం నేటికీ ఫసల్ బీమాకు సంబంధించిన మార్గదర్శకాలను విడుదల చేయకపోవడంపై రైతాంగం అసంతృప్తి వ్యక్తం చేస్తున్నది.

1,100 ఎకరాల్లో పంటలకు నష్టం ..

ప్రస్తుత వానకాలంలో జిల్లావ్యాప్తంగా 3.96 లక్షల ఎకరాల్లో పంటలను సాగు చేస్తారని అంచనా ఉండగా.. ఇప్పటివరకు 2.51 లక్షల ఎకరాల్లోనే పంటలు సాగయ్యాయి. ఎప్పటికప్పుడు వ్యవసాయశాఖ అధికారులు పంటల సాగు వివరాలను ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేస్తున్నారు. పంటల బీమాకు సైతం ఈ వివరాలే ప్రామాణికం. బీమా అమల్లో పంట విత్తుకునే సమయంలోనే ప్రీమియం చెల్లించాలి. పంట నష్టం జరిగినప్పుడు ఒక్కో పంటకు ఒక్కో విధానం ఉంటుంది. పరిహారం చెల్లింపులోనూ గ్రామం, మండలం యూనిట్‌గా తీసుకుని పంటల సాగును, దెబ్బతిన్న విస్తీర్ణాన్ని పరిగణనలోకి తీసుకుంటారు. అయితే ఇప్పటివరకు ప్రభుత్వం మార్గదర్శకాలను విడుదల చేయకపోవడంతో వానకాలంలో దెబ్బతిన్న పంటలకు బీమా పరిహారం అందకుండా పోయింది. ఇటీవల కురిసిన వానలకు జిల్లాలో 1,100 ఎకరాలకు పైగా నష్టం వాటిల్లింది. ఇందులో అత్యధికంగా పత్తి, ఆ తర్వాత వరి పంటలకు నష్టం కలిగింది. నష్టపోయిన పంటలకు ఎకరాకు రూ.10వేల చొప్పున సాయం అందిస్తామని ప్రభుత్వం ప్రకటించగా..ఆ సాయం ఏ మూలకు సరిపోదన్న విమర్శలున్నాయి. ఫసల్ బీమా పథకం అమలై ఉంటే పరిహారం అంది రైతులకు సాంత్వన కలిగేదన్న అభిప్రాయాన్ని రైతులు వ్యక్తం చేస్తున్నారు. భారీ వర్షాలు ఉంటాయని ముందే తెలిసినప్పటికీ..ప్రభుత్వం బీమాను అమలు చేయకపోవడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

యాసంగి నుంచి కలిసి రాని సేద్యం ..

గత యాసంగిలో నెలకొన్న కరెంటు కోతలు, అనావృష్టి పరిస్థితుల నేపథ్యంలో జిల్లా రైతాంగం తీవ్రంగా నష్టపోయింది. వానకాలంలోనైనా అదృష్టాన్ని పరీక్షించుకుందామంటే నిరాశే ఎదురైంది. తీరా..పంటలు చేతికొచ్చే సమయంలో కురిసిన అకాల వర్షాలు రైతుల ఆరుగాలం శ్రమను నీటిపాలు చేశాయి. వానకాలం పంటల సాగుకు సంబంధించి పెట్టుబడి సాయంగా ప్రభుత్వం ఎటువంటి సాయాన్ని అందించలేదు. దీంతో రైతాంగం పెట్టుబడుల కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వేలాది మందికి రుణమాఫీ కాకపోవడం..కొత్తగా రుణాలు అందకపోవడంతో రైతు లు ఎక్కే గుమ్మం..దిగే గుమ్మం..అన్నట్లుగా వ్యవసాయ శాఖ కార్యాలయాలు, బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. అతివృష్టి, అనావృష్టి పరిస్థితులతో గత యాసంగి నుంచి కలిసి రాక ఆర్థికంగా చితికిపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వానకాల సీజన్ ముగుస్తున్నా..
జారీ కాని మార్గదర్శకాలు

- ఇటీవల కురిసిన వర్షాలకు రంగారెడ్డి జిల్లాలో 1,100 ఎకరాలకు పైగా పంటలకు నష్టం
- నష్టపోయిన రైతులకు చేజారిన పరిహారం
- గత యాసంగి నుంచి కలిసిరాని సేద్యంతో ఆపసోపాలు పడుతున్న అన్నదాతలు



ప్రాజెక్టు అందాలను తిలకిస్తున్న పర్యాటకులు

బోటింగ్ చేసి.. సరదాగా గడిపి..

కోట్‌పల్లి ప్రాజెక్టులో పర్యాటకుల సందడి

వారాంతం కావడంతో కిటకిట

మండలంలోని కోట్‌పల్లి ప్రాజెక్టు పర్యాటకులతో కిటకిట లాడింది. ఆదివారం వీకెండ్ కావడం, వరుస సెలవులు కలిసి రావడంతో వికారాబాద్, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల నుంచి అధిక సంఖ్యలో తరలి వచ్చి..సరదాగా ప్రాజెక్టు నీటిలో బోటింగ్ చేశారు. ఫొటోలు, సెల్ఫీలు తీసుకున్నా రు. బోటింగ్ అనంతరం ప్రాజెక్టు అందాలను తిలకించారు. కొందరు ఉదయమే కుటుంబ సభ్యులతో కలిసి వచ్చి సాయంత్రం వరకు అక్కడే ఉండి భోజనాలు చేసి తమ తమ ప్రాంతాలకు తిరుగు ప్రయాణమయ్యారు. ప్రాజెక్టు వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. సీసీ కెమెరాలతో నిఘాను పటిష్టం చేశారు.

- ధారూరు, సెప్టెంబర్ 15

కోట్‌పల్లిలో బోటింగ్ చేస్తున్న పర్యాటకులు

మెట్రో గ్రాఫ్ డౌన్..

2 నుంచి 5కు పడిపోయిన హైదరాబాద్ మెట్రో స్థానం
9 నెలలుగా ప్రతిపాదనలతోనే సరి
కాంగ్రెస్ సర్కారు కాలయాపన

సిటీబ్యూరో, సెప్టెంబర్ 15 (నమస్తే తెలంగాణ): సుస్థిర ప్రభుత్వం... సమర్థ నాయకత్వంతో పదేండ్లలో తెలంగాణ అన్ని రంగాల్లో అత్యుత్తమంగా ఎదుగుతూ వచ్చింది. హైదరాబాద్ మహానగరం అన్ని రంగాల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మంచి ర్యాంకులు, అత్యుత్తమ స్థానాలను సొంతం చేసుకుంది. అలాంటి మహానగరాన్ని కాంగ్రెస్ ప్రభుత్వ పాలన అట్టడుగు స్థాయికి తీసుకువెళ్తున్నది. ఒకప్పుడు ప్రపంచంలోనే అతి పెద్ద పబ్లిక్ ప్రైవేటు పార్టనర్ ప్రాజెక్టుగా హైదరాబాద్ మెట్రో రైలు రికార్డుల కెక్కింది. మహానగరంలో అత్యాధునిక ప్రజా రవాణా వ్యవస్థలో అత్యంత కీలకమైన మెట్రో రైలు ప్రాజెక్టులను కాంగ్రెస్ ఇష్టారాజ్యంగా మార్చివేసింది. గత కేసీఆర్ ప్రభుత్వం మొత్తం 415 కి.మీ మేర నగరం నలుమూలలా మెట్రో మార్గాలను దశల వారీగా నిర్మించాలని ప్రతిపాదనలు సిద్ధం చేయడంతో పాటు క్షేత్ర స్థాయిలో పనులు చేపడితే వాటిని పూర్తిగా రద్దు చేసి.. కొత్త మార్గాలను 70 కి.మీలకు పరిమితం చేసి.. రేవంత్ సర్కారు ప్రతిపాదించింది. దీంతో 9 నెలలుగా కొత్తగా ఒక్క మెట్రో ప్రాజెక్టుకు కేంద్రం నుంచి అనుమతులు రాకపోవడమే కాకుండా నిర్మాణంలో ఒక్క కి.మీ మెట్రో మార్గం కూడా లేదు. దీంతో దేశంలో హైదరాబాద్ మెట్రో రైలు స్థానం 5వ స్థానానికి పడిపోయింది. ఇప్పటి వరకు 70 కి.మీ మేర ప్రతిపాదించిన 7 మార్గాలకు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదికలు(డీపీఆర్) సిద్ధం చేయలేని దుస్థితి కాంగ్రెస్ ప్రభుత్వానిది. ఒకవైపు హైదరాబాద్ కంటే వెనుకబడి ఉన్న చెన్నై, బెంగళూరు, పుణె వంటి నగరాల్లో 100కు పైగా కి.మీ మేర మెట్రో మార్గాలు నిర్మాణంలో ఉంటే, హైదరాబాద్‌లో మాత్రం నిర్వహణలో ఉన్నది కేవలం 69 కి.మీలు ఉండగా, నిర్మాణంలో ఒక్క కి.మీ మెట్రో మార్గం లేదు. ఇక ప్రతిపాదన దశలో ఉన్న 70 కి.మీ మార్గానికి ఎప్పుడు డీపీఆర్ వస్తుంది? దానికి కేంద్రం నుంచి అనుమతులు, నిధుల కేటాయింపు అన్నది పెద్ద ప్రశ్నగా మారింది.

దేశంలో 902 కి.మీ మెట్రో మార్గం...

దేశ వ్యాప్తంగా ఉన్న అన్ని నగరాల్లో కలిపి మెట్రో మార్గం సుమారు 902.39 కి.మీ మేర ఉండగా, ఆ మార్గాల్లో మెట్రో రైలు రాకపోకలు సాగిస్తూ అత్యాధునిక ప్రజా రవాణాకు దోహదం చేస్తున్నాయి. మెట్రో రైళ్లకు దేశ వ్యాప్తంగా ఆదరణ ఉండడంతో కొత్తగా మెట్రో మార్గాలను ప్రతిపాదిస్తూ , దశల వారీగా నిర్మాణం చేపడుతున్నారు. ప్రస్తుతం నిర్మాణ దశలోనే 649.56 కి.మీ ఉండగా, కొత్త ఆమోదం పొందిన మార్గాలు 261.03 కి.మీ, ప్రతిపాదనల దశలో మరో 1065 .83 కి.మీ మేర మెట్రో మార్గాలు ఉన్నాయి. ఇలా దేశ వ్యాప్తంగా పట్టణ ప్రాంతాల్లో మెట్రో రైలు సౌకర్యాన్ని కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు అందుబాటులోకి తీసుకువస్తూనే ఉన్నాయి. అయితే హైదరాబాద్ మెట్రో రైలు మార్గం మొత్తం దూరం 69 కి.మీకే పరిమితమవ్వడంపై నగర వాసులు నిరుత్సాహంతో ఉన్నారు. మెట్రో మార్గాల నిర్మాణంలో ఢిల్లీ మెట్రోతో పోటీపడాల్సిన హైదరాబాద్ 5వ స్థానం నుంచి అంతకంతకు దిగజారిపోతున్న పరిస్థితి కనిపిస్తున్నది.